# మిస్టర్ పెళ్ళాం

-శ్రీపతి. పి.



ఓ బస్టాండ్లో...

నిండు జనం ముందర...

పండు సాయం సమయాన...

పరమేశ్వర్ చెంపపై ఓ సుతిమెత్తనిచేయి 'ఫట్'మని తాకింది. కౌరవ సభలో ద్రౌపది వస్త్రాపహరణం జరిగినపుడు కూడా జనం అంతలా ఆశ్యర్యపోయి ఉండరు. అంతకు రెండింతలై అక్కడి జనం స్పందించారు.

కొందరు ముక్కున వేలేసుకుంటే, మరి కొందరు మట్టలు విరిచారు. కొం దరు 'హవ్వ!' అంటే, ఇంకొందరు 'భలే!' అన్నారు.

ఆయనకి మాత్రం కళ్ళు బైర్లు కమ్మాయి. ఒక్కసారి తల విదిలించి చుట్టూ చూశాడు. ఎగురుతోన్న పక్షులు గాల్లోనే ఆగిపోయినట్టూ, ఊగిసలాడే చెట్లకొమ్మలు ిశ్చలమైపోయినట్లూ, తిరుగాడే వాహనాలు క్షణకాలం నిలిచిపోయినట్లూ, అక్కడి జనానికి అదో ప్రపంచ వింతయినట్టూ... గమ్మత్తుగా, మత్తుగా కనిపించసాగింది.

ట్రాజెడీ సినిమాలో కమెడియన్‌లా లోకాన్ని పిచ్చి, పిచ్చిగ చూశాడు. ఏం జరిగిందీ... ఎందుకిలా అవుతోందీ ఆయనకు అంతుబట్టలేదు. పక్కనే ఎవర్నయినా వాకబు చేద్దామనుకున్నాడు.

"ఓ నారితో న్యూసెన్స్ చేస్తే లభించే భారీ ఇనాం ఇదే నాయనా" ఓ వయసు మల్లిన గొంతు చల్లగా ఆశీర్వదించింది.

అటువైపు ఓసారి తలతిప్పిచూసి "పిచ్చోళ్ళు..." అనుకుంటూ చక్కావెళ్ళి ఆటోఎక్కాడు పరమేశ్వర్.

★ ★ ★

చలికాలపు చల్లని సాయం సమయం.

పట్టణ మంతా కుంపటి రగిలించుకుంది. దాని సింబాలిక్‌గా సూర్యుడు ఎర్రగా వెలిగిపోతున్నాడు. చలితాపానికి తట్టుకోలేక పోతున్నాడేమో, గుట్టు చప్పుడు కాకుండా జారుకుంటున్నాడు.

విధుల నిర్వహణ నుండి విముక్తులైన వీరాంగ లూ, వాహ్యాళిని చాలించుకున్న వయోవృద్ధులూ, పి ముగిసిన కార్మిక సోదరులూ, ఆఫీసుల్నుండి బయటప అంకుళ్ళూ, ఆంటీలూ, క్లాసులు ముగించుకున్న క పిల్లలూ, దినచర్యలో అదో భాగమై నట్టు రోడ్డునప రోమియోలూ... అన్ని రకాలూ, అన్ని రంగులూ రోడ్డు చేరిన అనిశ్చిత సమయం.

సిటీలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆ బస్టాపు రోజూలాగే రంగవల్లిలా మెరిసిపోతోంది. పరమేశ్వర్ తన కొలీగ్స్‌తో అక్కడికి చేరాడు.

టైంపాస్‌కు ఆఫీసుకు తీసుకువచ్చిన కైలాసం మూడేళ్ళ కూతురు మున్నీని "కన్నా, బుజ్జీ... ఛీ... ఛీ..." అంటూ ఆడిస్తున్నాడు పర మేశ్వర్.

"చిత్తంకుల్... ఐక్లీమ్...!"

వేలెత్తి చూపుతూ ముద్దుగా అడిగింది మున్నీ.

తప్పుదుగదా! ఐదు రూపాయలు పెట్టి ఖరీదు చేశాడు. తినిపించే బాధ్యతకూడా తనదే.

అదేపనిలో ఉండగా విజయశాంతి నడుచుకుంటూ అక్కడికి వచ్చింది. సినీ నటి విజయశాంతిని చూసినట్టుగా అందరూ వింతగా చూస్తున్నారు.

ఆవిడ వాళ్ళాఫీసులో ఇటీవలే కొత్తగా చేరిన టైపిస్టు. ఎప్పుడూ 'సాబూ'పై సవారీచేసే ఆమె ఆరోజు బస్టాపుకు రావడం అందరికీ వింతేమరి!

ఆమెకంటపడిందే తడవు మున్నీని తక్కున క్రిందకు దింపీ, తెల్లని చొక్కాపై పడ్డ ఐస్‌క్రీం మరకల్ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ నీట్‌నెస్‌ను ప్రదర్శించసాగాడు పరమేశ్వర్.

ఆమె రాక గురించి ప్యాంటూ, చొక్కాలన్నీ తమ, తమ ఆలోచనల్లో మునిగిపోయాయి. మొహాలు నీట్‌గా తుడుచుకోవడం, యాధృచ్ఛికంగానే చేస్తున్నట్లు తల దువ్వుకోవడం, టక్‌లు సర్దుకోవడం బట్టి వాళ్ళ అంతరంగమేమిటో అర్థమై పోతోంది.

చాలా లిమిట్‌గా ఉండే శాంతి దగ్గరకు చనువుగా చేరాడు పరమేశ్వర్.

ఇది తమ ఆఫీసు స్టాఫ్‌కి ఆశ్చర్యంగా కాస్త ఉత్సుకతగా అనిపించింది.

ఆఫీసులో వాళ్ళిద్దరూ అప్పుడప్పుడూ పలకరించుకోవడం చూశారు గానీ, వాళ్ళమధ్య ఒంటరిగా కలిసేంత ఫ్రెండ్‌షిప్ ఉందని తెలీదు.

ఇదే విషయమై వాళ్ళలో చర్చలు ప్రారంభమయ్యాయి. క్షణాలు గడుస్తున్నాయి. చాలామంది కళ్ళు వాళ్ళిద్దరిమీదే ఉన్నాయి.

మరికొద్ది క్షణాలు... ఒక్కసారి గా పరమేశ్వర్ చెంప ఛెళ్ళుమంది.

★ ★ ★

ఆఫీసు సమయానికి శాంతి తన సీటుపైకి చేరింది.

"పరమేశ్వర్ ఇంకా రాలేదేమిటి?"

"ఇంకేం వస్తాడు? సిగ్గుతో ఇంట్లో చితికిపోతూ ఉంటాడు."

"అవునూ! ఆయనేంటి అలా ప్రవర్తించారు?"

"ఎలా...?" ఎలాగో ఎవ్వరికీ తెలీదు.

అక్కడ జరిగిందేమిటో వీరి ఊహలకు అందలేదు గానీ, కనిపించింది మాత్రం శాంతి లెంపకాయ కొట్టడం.

కాస్త ఆలస్యంగా పరమేశ్వర్ ఎంటరయ్యాడు. మామూలుగానే విధుల్ని ప్రారంభించాడు. స్టాఫందరిల్లోనూ ఉత్కంఠత నెలకొంది.

చివరకు ఉండబట్టలేక లంచ్ సమయంలో కొందరు పరమేశ్వర్‌ను చుట్టుముట్టారు. ఆమాటా, ఈమాటా అయ్యాక అసలు విషయం ప్రస్తావించారు.

"ఎవరూ? మా శాంతా? నన్ను కొట్టడమేమిటి? అదీ రోడ్డుపైన...ఎవరయ్యా అంది ఆ మాట? ఆ వెధవని నా ముందరికి రమ్మనండీ!"

తమల్ని వెధవల్నిచేసిన పరమేశ్వర్ మాటల్ని కాసేపు పక్కనపెట్టి "మా శాంతి" అంటా డేమిటి అన్న ఆలోచనలో పడ్డారు వాళ్ళు.

అది గమనించిన అతడు "ఆవిడ నా మిస్టర్ పెళ్ళామండి. ఆఫీసులో తన పరిధిలో తను ఉన్నా, బయటి కి రాగానే నా పెళ్ళామై పోతుంది. అదే మిస్టర్... ఆ రోజు, సినిమాకెళ్లాను. వంట చేయడం కుదరదు. దయచేసి ఈ ఒక్క రోజు నువ్వు చేసిపెట్టవూ అంటే...

'ఈ మాత్రం దానికి మరీ ఇంత రిక్వెస్ట్ చేయాలటండీ! ఒక్కరోజేగా... తప్పకుండా చేసిపెడ్తా'. అంది.

జీవితంలో మొదటిసారి, సంతోషం పట్టలేక 'హుర్రే' అని అరిచా. నేనీలోకంలో లేనని గ్రహించి, చెంపతట్టి "ఏవండీ! నే వెళ్తున్నా" అంది.

ఆ తట్టడంలోనే కొంచెం ఫోర్సెక్కువై నట్టుంది. అవునూ... మా పర్సనల్ విషయాల గురించి మీకెందుకండీ అంత ఇంటరెస్ట్?"

అప్పుడే హాల్లోకి వచ్చింది శాంతి. "ఏవండీ కూరెలా ఉంది?" దగ్గరగా వచ్చి పలకరించింది.

"అబ్బా! చాలా బ్రహ్మాండంగా ఉంది. పోతే బంగాళా దుంపల్ని ఇంకాస్త ఉడికించీ, ఉప్పుకూడా కొంచెం వేసి ఉంటే మరింత బాగుండేది" చెప్పాడు పరమేశ్వర్. అంతా 'ఆ' అంటూ నోళ్ళు తెరిచారు.

శ్రీపతి. పి.
నవీపేట (పోస్ట్),
నిజామాబాద్ జిల్లా.



## పోట్లాట

సురేష్ ఐదు నక్షత్రాల హోటల్‌కి వెళ్ళి సర్వర్‌తో అన్నాడు "పోట్లాట మొదలయ్యే లోపల అర్జంటుగా ఓ చికెన్ బిర్యాని పట్రా"

సర్వర్ అతనికి చికెన్ బిర్యాని ఇచ్చి కిటికీలోంచి చూశాడు - ఎవరు కనపడలేదు.

ఆ చికెన్ బిర్యాని గబగబ తినేసి అన్నాడు "ఇంక టైమున్నట్లుంది. పోట్లాట మొదలయ్యే లోపల మరో బిర్యాని పట్రా!"


దానిని అతను సగం తిన్నాక అడిగాడు సర్వర్ ఆసక్తిగా "పోట్లాట ఎవరితో అవుతుంది సార్?"

"నీతోనే!"

"నాతోటా? ఎందుకు?"

"నీకు చెల్లించడానికి నా దగ్గర డబ్బులు లేవుగా..." చెప్పాడు సురేష్.

-పి.వి.మురళీకృష్ణ,
ఇ.నెం.16-11-418/3/2
ఆంధ్ర లా టైమ్స్ దగ్గర




కె.రాధ, వైఫాఫ్:శ్రీనివాస్, పోస్ట్:మల్లారం, మం:తాడిచెర్ల -505 184, జిల్లా: కరీంనగర్.